క్లుప్తంగా

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



వాహన యజమానులకు హెచ్చరిస్తున్న ఎస్‌ఐ రమణ

చింతపల్లిరూరల్: వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని అన్నవరం ఎస్‌ఐ రమణ అన్నారు. అన్నవరం సంతలో ఆటో, ద్విచక్ర వాహన డ్రైవర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా వాహనాలు నడపడం వలన ప్రమాదాలు నివారించవచ్చని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధాన రహదారులు వద్ద నిఘా కెమెరాలు ఏర్పాటు చేశామని, మితిమిరిన వేగంతో వెళ్లే వాహన చోదకులపై చర్యలు తీసుకుంటామన్నారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో ఓటర్ల సర్వే



సర్వే చేస్తున్న బీఎల్‌వోలు, సిబ్బంది

డుంబ్రిగుడ: మండల వ్యాప్తంగా ఓటర్ల సర్వే ముమ్మరంగా జరుగుతోంది. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు సొవ్వ, కితలంగి, అరకు, కొర్రాయి పంచాయతీల్లో బీఎల్‌వోలు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఓటరు వివరాలను సేకరించారు. సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో బీఎల్‌వో, సిబ్బంది బృందాలుగా గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. బీఎల్‌వోలు సంజీవరావు, అచ్చమ్మ, అనంతరావు, మనోజ్, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా జయంతి



మారేడుమిల్లి: మారేడుమిల్లి ఇన్‌చార్జి ఎంపీడీవోగా జయంతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో మారేడుమిల్లి కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి పదోన్నతిపై సీనియర్ అసిస్టెంట్‌గా రాజవొమ్మంగి కార్యాలయానికి బదిలీ అయ్యారు. అక్కడ నుంచి ఏవోగా పదోన్నతి పొంది తిరిగి మారేడుమిల్లి కార్యాలయానికి వచ్చారు. ప్రస్తుతం ఆమెకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా బాధ్యతలు అప్పగించారు.

మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న ఎస్‌ఐ లోకేష్‌కుమార్

కొయ్యూరు: బూదరాళ్ల పంచాయతీ కేంద్రంలో మంప ఎస్‌ఐ లోకేష్‌కుమార్ సోమవారం పర్యటించారు. ఆపరేషన్ పరివర్తన్‌లో భాగంగా గ్రామంలోని రైతులకు జీడిమామిడి, చింత తదితర మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు ప్రత్యామ్నాయ పంటలు వేసుకొని, ఉద్యానవన మొక్కల సాగుతో ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. కునుకూరు, గరిమండ, పిట్లపాడు, అన్నవరం, బొడ్డుమామిడి, కొత్రపాడు గ్రామాలకు చెందిన రైతులకు అందజేశారు. పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



జేసీ శివశ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నేతలు

పాడేరు రూరల్: జీతాలు పెంచాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనకు దిగారు. ఐటిడిఏ నుంచి కలెక్టర్ కార్యలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, నినాదాలు చేస్తూ ధర్నా చేశారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్‌కు అందజేశారు. నాయకులు చిన్నయ్యపడాల్, పోతురాజు, మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

శరవేగంగా భూ సర్వే

- భూవివాదాలకు చెక్
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



ముంచంగిపుట్టులో సమగ్ర భూ సర్వేను నిర్వహిస్తున్న సర్వే అధికారులు

ముంచంగిపుట్టు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సమగ్ర భూ సర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. దాదాపు వందేళ్ల తర్వాత దేశంలోనే తొలిసారిగా ఆంధ్రప్రదేశంలో భూములు రీసర్వేకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా రెవెన్యూ అధికారులు గ్రామాల్లో పర్యటించి రైతుల సమక్షంలో ముమ్మరంగా సర్వేను చేపడుతున్నారు. డ్రోన్లతో, మ్యాపులతో సర్వే నిర్వహించి రికార్డుల్లో నమోదు చేస్తున్నారు. సర్వే నంబర్లు ఆధారంగా పల్లం, మెట్ట భూములు, పోరంబోకు, ప్రభుత్వ భూములను గుర్తించారు. ముంచంగిపుట్టు మండలంలో 325 రెవెన్యూ గ్రామాల్లో 78,097.23 ఎకరాల్లో సర్వే చేయాల్సి ఉండగా జూలై 31వ తేదీ వరకు 99 గ్రామాల్లో 19,410.56 ఎకరాల్లో సర్వే చేసినట్టు రెవెన్యూ అధికారులు తెలిపారు.

కచ్చితమైన కొలతలు

సమగ్ర భూ సర్వేతో రెవెన్యూ గ్రామాల్లో హద్దులను నిర్ణయించి, డ్రోన్ ఫ్లైయింగ్ గ్రౌండ్ కంట్రోల్ పాయింట్లను గుర్తించి సర్వే రాళ్లను ఉంచుతారు. పంచాయతీ అధికారుల సహాయంతో నివాస గృహాలను గుర్తిస్తారు. అన్ని రకాల భూములను గుర్తించేందుకు గాను ప్రతి హద్దుకు జీఎన్ఎస్ఎస్ రోవర్, ఈటీఎస్ వంటి ఆధునిక యంత్రాల సహాయంతో అక్షాంశ, రేఖాంశాలతో కూడిన జియో కోడ్స్ డేటాను, భూముల ఛాయా చిత్రలను సేకరిస్తారు.ఈ డేటా ఆధారంగా సర్వే ఆఫ్ ఇండియా ప్రతీ గ్రామానికి అర్థోరెక్టిఫైడ్ ఇమేజ్ (ఓఆర్ఐ) ఛాయా చిత్రాలను అందించి ఖచ్చితమైన భూములను నిర్ధారిస్తుంది. రైతులు కోరితే గొలుసుతో సైతం భూమిని కొలిచి విస్తీర్ణం చూపిస్తారు. అప్పటికీ ఏమైనా అభ్యంతరాలుంటే మండల మెజిస్ట్రేట్ (తహసీల్దార్)కు అప్పీలు చేసుకుంటే 30 రోజుల్లో సమస్య పరిష్కారమవుతుంది. గ్రామాల్లో జరుగుతున్న సమగ్ర భూ సర్వే పట్ల రైతులు సైతం భూ సమస్యలు తీరుతుండడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు ఎంతో మేలు



సమగ్ర భూ సర్వే వల్ల రైతులకు ఉంతగానో మేలు చేస్తుంది. రైతుల పొలాల విస్తీర్ణం పక్కాగా ఉండడం వలన ఎవరి పొలం ఎంత విస్తీర్ణంలో ఉందనేది తెలుస్తుంది. దీంతో పాటు వందేళ్ల నాటి రెవెన్యూ రికార్డులు ప్రక్షాళన జరగడంతో పాటు నూతన రికార్డులు తయారవుతాయి. తద్వారా రైతుల మధ్య భూ సమస్యలు తగ్గుతాయి. రైతులకు అవగాహన కల్పిస్తూ వారి సమక్షంలోనే భూ రీ సర్వేను నిర్వహిస్తున్నాం.

– నర్సమ్మ, తహసీల్దార్, ముంచంగిపుట్టు మండలం

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న ధ్రువపత్రాలను త్వరితగతిన పరిశీలించి, లబ్ధిదారులకు సకాలంలో అందజేయాలని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సూచించారు. మండల పరిషత్ కార్యలయంలో పంచాయతీ కార్యదర్శులతో సోమవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు 16 పంచాయతీల్లో జగనన్న సురక్ష కార్యక్రమం పూర్తయిందన్నారు. అయితే కొందరు లబ్ధిదారులకు అందజేయాల్సిన ధ్రువపత్రాలను త్వరలో మండల స్థాయిలో జరగనున్న కార్యక్రమంలో పంపిణీ చేస్తామన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కీమ్, సమస్యలు కూడా పరిష్కారించేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈవోపీఆర్‌డీ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల భవనానికి శంకుస్థాపన



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ మురళీ, జెడ్పీటీసీ సత్యవేణి తదితరులు

దేవీపట్నం: ఇందుకూరు పంచాయతీలోని పెదర మణయ్యపేట ఎంపీపీ పాఠశాల భవన పనులకు ఎంపీపీ కుంజం మురళీ, జెడ్పీటీసీ సభ్యురాలు శిరశం సత్యవేణి సోమవారం శంకుస్థాపన చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలో పాఠశాల సమస్యను స్థానికులు ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ నిధుల నుంచి రూ.3లక్షలు, మండల పరిషత్ నుంచి రూ.3 లక్షలు మంజూరైనట్టు చెప్పారు. ఈ మేరకు పనులు త్వరలో ప్రారంభమవుతాయన్నారు. పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. సర్పంచ్ కోసు లక్ష్మణ్, నాయకులు సత్యనారాయణ, మురళీకృష్ణ, కన్నయ్య స్థానికులు పాల్గొన్నారు.

9న శాంతి ర్యాలీ



మాట్లాడుతున్న జేఏసీ నేత రామరావుదొర

పాడేరురూరల్: మణిపూర్‌లో జరిగిన హింసాత్మక ఘటనను నిరసిస్తూ, ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నాడు శాంతియుత నిరసన తెలియజేయాలని ఏపీ ఆదివాసీ జేఏసీ అల్లూరి జిల్లా కన్వీనర్ రామరావుదొర పిలుపునిచ్చారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న హింస, ఈ దేశ ఆదివాసీ ఉనికిని దెబ్బతిస్తుందన్నారు. ఈ అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, మణిపూర్‌లో శాంతిని నెలకోల్పేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు 9వ తేదీన శాంతి ర్యాలీ చేపట్టనున్నట్టు తెలిపారు. రాష్ట్ర ప్రచార కార్యదర్శి గంగన్నపడాల్, రాష్ట్ర కార్యదర్శి గంగరాజు, జిల్లా కార్యదర్శి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనకు నిరసనగా ర్యాలీ



మండల కేంద్రంలో మానవహారం చేస్తున్న క్రైస్తవులు

గూడెంకొత్తవీధి: మణిపూర్‌లో జరిగిన ఘటనను నిరసిస్తూ మండల కేంద్రంలో సోమవారం క్రైస్తవులు శాంతి ర్యాలీ చేపట్టారు. స్థానిక పూజారిపాకలు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతి నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దోషులకు ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు. ఫ్రీ మణిపూర్..సేవ్ మణిపూర్ అంటూ నినాదాలు చేశారు. మణిపూర్‌లో క్రైస్తవ కుటుంబాలకు, మతబోధకులకు, ఆదివాసీలకు రక్షణ కల్పించాలని, జరిగిన సంఘటనపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాస్టర్లు పద్మాకరన్, డేవిడ్ రాజ్, తిమోతి, భూపతి, చలపతి, యేసురాజు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పశువుల ఆస్పత్రి



శిథిలదశలో ఉన్న భవనం వద్ద కూలిన చెట్లు

రాజవొమ్మంగి: రాజవొమ్మంగిలో గల గ్రామీణ పశు వైద్యశాల భవనం పూర్తి శిథిలస్థితికి చేరుకొంది. ఈ భవనం నిర్మించి 40 సంవత్సరాలు పైబడిందని స్థానికులు చెబుతున్నారు. కాగా ఈ భవనం ప్రాంగణంలో గల రెండు భారీ చెట్లలో ఒకటి భవనంపైకి ఒరిగి పోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గోడలు పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. మరోటి నేల కూలింది. పదేళ్ళవుతున్నా ఈ చెట్లను అధికారులు తొలగించకపోవడం గమనార్హం. మరో వైపు భవనం ఎక్కడికక్కడ పెచ్చులూడిపోతూ ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వర్షం వస్తే ఆసుపత్రి లోపలకు నీరు చేరి విలువైన సామగ్రి, మందులు పాడైపోతున్నాయని గోపాలమిత్ర చెప్పారు. విధులకు వచ్చే అధికారులు ఈ భవనంలో ఉండేందుకు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం

నాతవరం: అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులకు పద్మశాలి సంఘం నాయకులు సోమవారం ఆర్థిక సాయం అందించారు. మండలంలోని గునుపూడి గ్రామంలో ఇటీవల పసగడుగుల కన్నబాబు, పి.నాగరాజు, పలకా అచ్చియ్యమ్మలు అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయారు. వీరికి అనకాపల్లి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షుడు మాడెం సూరి అప్పారావు, రాష్ట్ర పద్మశాలి యువజన సంఘం కార్యదర్శి కొండపల్లి సతీష్‌బాబు, సొసైటీ అధ్యక్షుడు టి.ఈశ్వరరావు, గాజువాక పద్మశాలి సంఘం అధ్యక్షుడు కొడి శ్రీను, సంఘ సభ్యులు సిద్ధార్థ శ్రీనివాసరావు, బాబ్జి, శ్రీనివాసరావులు బాధితులకు రూ.35 వేలు నగదు అందించారు. కార్యక్రమంలో స్థానిక సొసైటీ అధ్యక్షుడు పలకా జోగిరాజు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

3న మన్యం బంద్

రాజవొమ్మంగి: మండలంలోని చికిలింత గ్రామంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆదివాసీ, గిరిజన సంఘం నాయకులు సూరిబాబు, పాపారావు మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న మారణహోమాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌లో సంఘటనలను నిరసిస్తూ ఈనెల 3న చేపట్టనున్న మన్యం బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ మణిపూర్ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ ప్రభుత్వాన్ని తక్షణ రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సంఘటనలో దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిని కలిసిన జెడ్పీటీసీ



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మిని కలిసిన హుకుంపేట జెడ్పీటీసీ మత్స్యలింగం

హుకుంపేట: అల్లూరి జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షురాలు, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మిని హుకుంపేట జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం సోమవారం పాడేరులోని ఆమె నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఏజెన్సీలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఆయనతో పాటు యువజన విభాగ జిల్లా ప్రధాన కార్యదర్శి నైని సత్తిబాబు, సర్పంచ్‌లు పాతుని రవణమ్మ, దూసురి పద్మకుమారి, నాయకులు చందన పాత్రుడు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

భవనంపై నుంచి పడి బీటెక్ విద్యార్థి మృతి



మృతిచెందిన దత్తసాయి (ఫైల్)

కూనవవరం: మండలం కేంద్రం కూనవరానికి చెందిన ఉప్పలపాటి ప్రసాద్ కుమారుడు దత్తసాయి(24) చైన్నెలో ప్రమాదవశాత్తు భవనంపై నుంచి జారిపడి మృతిచెందాడు. దత్తసాయి అక్కడ బీటెక్ చదువుతున్నాడు. జులై 29న అక్కడ తాను నివసిస్తున్న భవనంపై నుంచి కాలు జారి కిందకు పడిపోవడంతో మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామం కూనవరానికి మంగళవారం చెన్నై నుంచి తీసుకుని కురానున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు.

పెద్దేరు నీరు విడుదల రేపు

మాడుగుల: మండలంలో అత్యంత జల వనరులు గల పెద్దేరు జలాశయం ప్రధాన పంట(రాచకట్టు) కాలువ ద్వారా సాగు నీటిని మంగళవారం ఉదయం 8 గంటలకు విడుదల చేయనున్నట్టు వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ తెలిపారు. సోమవారం మండలంలోని జేడీపేటలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఖరీఫ్ వరి సాగుకు వీలుగా నీటిని విడుదల చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమానికి పెద్దేరు ఆయకట్టు రైతులతో పాటు ప్రజాప్రతినిధులు విధిగా హాజరు కావాలని రాజారామ్ కోరారు.

ఈదురు గాలులకు విరిగిన విద్యుత్ స్తంభం



ఈదురు గాలులకు ధ్వంసమైన స్తంభం

ముంచంగిపుట్టు: మండల కేంద్రం నుంచి కరిముఖిపుట్టు పంచాయతీ కేంద్రానికి వెళ్లే మార్గంలో ఫారెస్టు కార్యాలయం సమీపంలో 11కేవీ విద్యుత్ స్తంభం సోమవారం ఉదయం వీచిన ఈదురు గాలులకు విరిగిపోయింది. దీంతో భారీగా మంటలు వ్యాపించాయి. గమనించిన స్థానికులు విద్యుత్ సబ్ స్టేషన్‌కు సమాచారం అందించడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సంఘటన స్థలానికి వచ్చిన సిబ్బంది విద్యుత్ వైర్లను తొలగించారు. కరిముఖిపుట్టు, జర్జుల,జర్రెల పంచాయితీలకు చెందిన 51 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.విద్యుత్ శాఖ అధికారులు స్పందించి వెంటనే నూతన విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధకరించాలని ఆయా గ్రామస్తులు కోరారు. మంగళవారం స్తంభం ఏర్పాటు చేసి విద్యుత్‌ను పునరుద్ధీకరిస్తామని విద్యుత్‌శాఖ అధికారులు తెలిపారు.

వంతెన నిర్మాణానికి సర్వే



కోసంగి గెడ్డ వద్ద బ్రిడ్జి నిర్మాణానికి స్థలాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ వెంకటరావు, అధికారులు

డుంబ్రిగుడ: మండలంలోని పోతంగి పంచాయతీ కోసంగి గెడ్డపై బ్రిడ్జి కోసం స్థానికులు సర్పంచ్ వెంకటరావు, ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే వంతెన నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించి, ప్రతిపాదనలు తయారు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ మేరకు అధికారులతో కలిసి సర్పంచ్ వెంకటరావు కోసంగి గెడ్డను పరిశీలించారు. వంతెన నిర్మాణం కోసం కొలతలు తీసి, సర్వే చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వంతెన లేక కొన్నేళ్లుగా గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారని, ఎట్టకేలకు వంతెన నిర్మాణానికి ప్రతిపాదనల కోసం ఎమ్మెల్యే ఆదేశించడం ఆనందంగా ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మన్యంలో జోరుగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు.

కల్వర్టు నిర్మాణానికి చర్యలు



కల్వర్టు నిర్మాణ ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ గంగరాజు, సర్పంచ్ రూతు

అనంతగిరి: మండలంలోని మాలింగవలస గెడ్డ వద్ద కల్వర్టు నిర్మాణ ప్రదేశాన్ని ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ గంగరాజు, సర్పంచ్ రూతు సోమవారం పరిశీలించారు. వర్షాల కారణంగా గెడ్డ పొంగి ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని మాలింగవలస, పాతకోట, రేగం, తెనెపుట్టు తదితర గ్రామస్తులు ఎంపీపీకి విన్నవించారు. దీనిపై స్పందించిన ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా తాత్కాలికంగా కల్వర్టు నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. పెద్దూరు నుంచి పాతకోట మీదుగా పెదబయలు వరకు నిలిచిపోయిన రింగురోడ్డు పనులను పూర్తి చేసే విధంగా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాలని ఎంపీడీవో కుమార్‌ను కోరారు. కో ఆప్షన్ సభ్యుడు మదీనా తదితరులున్నారు.

అరకు ఎమ్మెల్యే పరామర్శ



నివాళులర్పిస్తున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ

అరకులోయ రూరల్: మండలంలోని మాడగడ గ్రామానికి చెందిన దనాయికి రామన్న(60) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతు సోమవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ గ్రామంలో సందర్శించారు. రామన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, మనో ధైర్యం చెప్పారు. మండల పార్టీ అధ్యక్షుడు గాసి, వైస్ ఎంపీపీ రామన్న, సర్పంచ్ జ్యోతి, నాయకులు సాంబ, నర్సింగ్, నగేష్, బాలరాజు తదితరులున్నారు.

బురదలో ఇరుక్కున్న లారీ

రెండు గంటల పాటు రాకపోకలకు అంతరాయం



సింగంపల్లి వద్ద బురదలో చిక్కుకున్న లారీ

రాజవొమ్మంగి: మండలంలోని సింగంపల్లి గ్రామ సమీపాన ప్రధాన రహదారిపై సోమవారం బియ్యం లోడుతో వెళుతున్న జీసీసీకు చెందిన లారీ బురదలో కూరుకుపోయి నిలిచిపోయింది. జడ్డంగి ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి వట్టిగెడ్డ డీఆర్ డిపోకు బియ్యం తరలిస్తుండగా ఈ సంఘటన జరిగింది. దీంతో ఈ రహదారిపై దాదాపు రెండు గంటల పాటు రాకపోకలకు అంతరాయం కలిగింది. ఈ ప్రాంతంలో ఎన్‌హెచ్–516ఈ రహదారి నిర్మాణం జరుగుతున్న సంగతి తెలిసిందే. వర్షాల కారణంగా రోడ్డు కొంత మేర చిత్తడిగా తయారయ్యింది. ఈ మేరకు బురదలో చిక్కుకున్న లారీని రోడ్డు నిర్మాణ కార్మికులు పొక్లెయిన్ సాయంతో బయటకు తీశారు. అనంతరం వాహనాల రాకపోకలు యధావిధిగా సాగాయి.

బోరు పనులు ప్రారంభం



బోరు పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ గంగరాజు, సర్పంచ్ రూతు తదితరులు

అనంతగిరి: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీ నిధులతో మంజూరైన బోరు ఏర్పాటు పనులను ఎంపీపీ శెట్టి నీలవేణి, జెడ్పీటీసీ గంగరాజు, సర్పంచ్ రూతుతో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శెట్టి నీలవేణి మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయంలో తాగునీటి సమస్య లేకుండా బోరును ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సచివాలయానికి బోరు నుంచే నీటిని సరఫరా చేసే విధంగా పంచాయతీ నిధులను కేటాయిస్తామని సర్పంచ్ రూతు తెలిపారు. ఎంపీడీవో కుమార్, ఏవో లక్ష్మి నారాయణ, కో ఆప్షన్ సభ్యుడు మదీనా, సర్పంచులు సింహాద్రి, సీతయ్య, కార్యదర్శి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవింగ్‌పై శిక్షణ ప్రారంభం



జెండా ఊపి ఆటో డ్రైవింగ్‌పై శిక్షణ ప్రారంభించిన జోషి, శశిప్రభ తదితరులు

కొయ్యూరు: మండలంలోని డౌనూరులో గిరిజన యువతీ, యువకులకు ఆటో డ్రైవింగ్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. విశాఖకు చెందిన కన్సర్న్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ పి.కె.జోషి మాట్లాడుతూ రవాణా రంగంలో ఆటోలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. కుటుంబ జీవన పోషణ కోసం మహిళలు కూడా ఆటో డ్రైవింగ్ నేర్చుకుంటున్నారన్నారు. ఆశక్తి ఉన్న మహిళలు ఆటో డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన సిఫా సంస్థ ఫౌండర్ డైరెక్టర్ డాక్టర్ శశిప్రభ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. డ్రైవింగ్‌లో మహిళలు కూడా భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందన్నారు. సర్పంచ్ పొట్టిక భవానీ, బూత్ కమిటీ కన్వీనర్ పోతురాజు, డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ నాగూర్, స్కిల్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల ఆదేశానుసారం నష్ట పరిహారం



రాజవొమ్మంగిలో పాక్షికంగా తొలగించిన దుకాణాలు

రాజవొమ్మంగి: జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా ఇప్పటికే సర్వే పూర్తయిన రాజవొమ్మంగిలోని కట్టడాలను వెంటనే తొలగించాలని తహసీల్దార్ వై.వి.సుబ్రహ్మణ్యాచారి కోరారు. ఈ మేరకు సబ్ కలెక్టర్ శుభం బన్సల్ నుంచి సోమవారం ఆదేశాలు అందాయన్నారు. రాజవొమ్మంగి మీదుగా వెళ్లే ఈ రహదారి నిర్మాణానికి అడ్డుగా ఉన్న సుమారు 50 దుకాణాలను గుర్తించడం జరిగిందన్నారు. దుకాణలు, కట్టడాల యజమానుల నుంచి బ్యాంకు ఖాతా తదితర పత్రాలు సేకరించడం పూర్తయ్యిందని, నిర్వాసితుల బ్యాంకు ఖాతాలకు పరిహారం సొమ్ము జమ అవుతుందన్నారు. గడువు పూర్తయిన నేపథ్యంలో రోడ్డు నిర్మాణ పనులకు అడ్డుగా ఉన్న దుకాణాలను శిథిలాలను ఇక ఒకటి రెండు రోజుల్లో పూర్తిగా తొలగించాలని దుకాణదారులను తహసీల్దార్ ఆదేశించారు.